# ఎర

**కథానిక**

## చామర్తి దుర్గాప్రసాద్

"ఇది నా భూమి. నా తాత ముత్తాతల దగ్గర్నుంచీ అందరం కష్టంతో పండించి ఈ నేల మీద నెత్తురుతో శుద్ధి చేసి మరీ దేవతలా చూసుకున్నాం. నా దేవతని నా నుంచి ఎవరూ లాగేయ లేరు."

భూమయ్య అరుపులు అమీనాకి నవ్వు తెప్పించాయి. అమీనా పక్కనే నిల్చున్న ఆసామికి కోపాన్ని తెప్పించాయి.

ఆ ఆసామి పట్నంలో కాపరం ఉండి - వ్యాపారం చూసుకుంటూ పల్లెలో తన పొలాన్ని కౌలుకి ఇచ్చిన వాడు. ఆ కౌలు తాలూకు డబ్బు ఎప్పటి కప్పుడూ ముట్ట చెబుతూనే ఉన్నాడు భూమయ్య ఇంత వరకూ. అయినా ఆ భూమి తనదేనని భూమయ్య అనడం సబబు కాదు. ఎందుకంటే కౌలు కివ్వాల్సిందీ, లేందీ తేల్చవలసింది ఆసామీ, అంతేగాని దున్నేవాడు కాదు. ఈ మాత్రం అతి సామాన్య విషయం భూమయ్యకి తెలీనందుకే అమీనా నవ్వుకున్నాడు.

అది తెలీక కాదు. చమటా, రక్తమూ ధారపోసి పెంచిన పిల్లాడిని, ఎప్పుడో కని పారేసిన తండ్రి వచ్చి లాక్కొని పోతే, పెంచిన తండ్రికి వచ్చేది కోపం కాదు. బాధ. ఆ కొడుకు మీద ఆశలు పెట్టుకొన్నప్పుడు కలిగేది బాధే కాదు - అందులోంచి విరుచుకుపడే కెరటంలాంటి ఆవేశం. అందుకే భూమయ్య అరుస్తున్నాడు.

దత్తత చేసుకొన్నట్లు రుజువు లేనప్పుడు ప్రయోజకుడైన వాడ్ని "నా వాడే" అని కాజేసుకుపోగల అధికారం కన్న తండ్రికి ఉంది. చేతి కర్రలాంటి కుర్రాణ్ణి పోగొట్టుకొన్న వాణ్ణి ఏ చట్టమూ ఆదరించదు. అందుకే అమీనా నవ్వు.

అదృష్టం కలిసి వస్తే, నడిచి వచ్చే కొడుకు పుడతాడన్నది సామెత. ఆ సామెత మీద నమ్మకం ఉన్న ఆసామీకి అందుకే కోపం వచ్చింది భూమయ్య పిచ్చి అరుపులు విని,

"బాబూ చెప్పండి. మీ పొలాన్ని మీరు గుర్తు పట్టగలరా! ఎక్కడ నుంచి ఎక్కడకు ఉందో చెప్పండి. కళ్ళు మూసుకొని చెప్పగలను నేను ఏ రాయి ఎక్కడుందో." భూమయ్య పోగయిన జనాన్ని చూసి అన్నాడు.

నిజమే. ఆసామికి తన పొలం ఎక్కడ ఉందో తెలీదు. ఎంత ఉందో తెలుసు. కాగితాలు చూసి చెప్పగలడు ఎల్లలు.

ఆ కాగితాలు ఉన్నవాడే ఆసామి. లేని వాడు ఎన్ని అరచినా అర్థం లేదు.

అమీనా నవ్వు ఆగిపోయింది అతని డ్యూటీ గుర్తుకొచ్చింది. అందుకు తోడు ఆసామి ఇస్తానన్న డబ్బు గుర్తుకొచ్చింది. వెంట పెట్టుకు వచ్చిన పోలీసు సిబ్బంది అతనికి ధైర్యం ఇచ్చింది.

భూమయ్యని ఈడ్చిపారేసారు.

మరు క్షణంలో చుట్టు ఉన్న జనం రాళ్ళతో ఆసామీని, అమీనాను ముంచేశారు. వత్తాసుగా వచ్చిన నలుగురు పోలీసులు దూరంగా పారిపోయ్యారు. వాళ్ళకి సంతోషంగానే ఉంది కళ్ళ ముందు జరిగిన న్యాయం.

భూమయ్యా స్వాధీనం అయింది భూమి.

ఆసామి జేబులోంచి టోపి తీశాడు, నెత్తిన పెట్టుకున్నాడు, చర చర నడుచుకొంటూ వెళ్ళి పోయ్యాడు అతనిప్పుడెవరో అందరికీ అర్థం అయ్యింది. పోలీసులు దబ దబ వచ్చారు ముందుకి. ఆసామికి దండాలు పెట్టారు. భూమయ్యాని తప్పుకోమన్నారు.

భూమయ్యా ధైర్యంగా జనం వంక చూశాడు.

జనంలోంచి ఓ పెద్ద మనిషి ముందుకు వచ్చాడు. "భూమయ్యా తప్పుకో! ఆయన ఎవరో మనం గుర్తు పట్టలేదు. ఆయన మన యోగక్షేమాలు విచారించే నాయకుడు. మన కోసం సర్వం త్యాగం చేసి, పట్నంలో కిసాన్ యాత్రలు నడిపించి మన హక్కుల్ని రక్షించే పెద్ద మనిషి. ఆయనకి మనం చర్మంతో చెప్పులు కుట్టించినా తప్పు లేదు."

ఆ పెద్ద మనిషి మాటలు విన్న జనం మౌనంగా నిల్చున్నారు. అదను చూసి పోలీసులు అమాంతం భూమయ్యాని లాగి కేసు నమోదు చేశారు. ఆసామీ సలహా మీద, ఆ తర్వాత కేసు కాగితం చించేశారు.

జనం జై అంటుండగా ఆసామీ వెళ్ళి పోయాడు

భూమయ్యా మిగిలిపోయాడు.

ఎవరా జనం? ఆ జనం విప్లవ తరంగమా? కావచ్చు. కానీ ప్రస్తుతానికి ఎర మింగిన చేపలు! ఏమిటా ఎర? అది తెలీదూ మీకు?

# భవిష్యత్తులోకి...

కోడూరు ప్రభాకర రెడ్డి

నేడనే గవాక్షాన్ని తెరిచి వీక్షించాను
మండే ఎండల్లో మానవాళి
కండలన్నీ కరిగించే
దయనీయ దృశ్యాన్ని కాంచాను.
దేశాలను కలిపేస్తూ
హద్దులను చెరిపేస్తూ
వారిధులనూ, వాహినులనూ సంధించే
వారధులను దర్శించాను.

గుండెలలో తాపం సహించి
కుత్తుకలో కోపం వహించి
ఖాళీ కడుపులతో ఖైదీలు
వేసే రోడ్లను చూశాను.

తెల్లవారు, నల్ల వారు....ఓహ్!
నానాజాతి సమితి అది
బహుభాషా సమ్మేళనం అది.

నేడనేది నిజమని నమ్ముతూ
రేపనే దాని కోసం
ఆశతో అశ్రులు చాస్తూ
వారి మధ్యలో ఉన్నాను.

సోదరులారా అని
ఎలుగెత్తి పిలిచాను.
సోదరా! అని వేల గొంతుకలు
ప్రతిధ్వనించాయి.

భవిష్యత్తు బంగారు బాట
అవుతుందనే ఆత్మ విశ్వాసంతో
నిర్విరామంగా, నిర్వికారంగా
దుబాసీ లేకుండా తృప్తిదీరా
ముచ్చటించుకొన్నాం.

స్నేహితులారా!
నమ్మకమనేది లేకుండా
మనగలుగుతుందా మానవాళి?
మానవత్వమే జగతికి నివాళి!